క్లుప్తంగా

ఉద్యోగ, ఉపాధిపై ఉచిత శిక్షణ

కాచిగూడ: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. కాచిగూడ, హరాస్‌పెంట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో యోగా, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మెహిందీ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ శిబిరానికి స్పందన


శిక్షణ పొందుతున్న చిన్నారులు

నల్లకుంట: నల్లకుంట శివం రోడ్డు కూరగాయల మార్కెట్ వీధిలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో మంగళవారం చిన్నారులకు నిర్వహిస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో వేసవి శిక్షణా తరగతులకు విశేష స్పందన వచ్చిందని డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి తెలిపారు. మంగళవారం శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు అకాడమీ ఈవెంట్ మేనేజర్లు యామిని, నందిని ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా వసుధా మూర్తి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా శిబిరంలో చేరి వివిధ అంశాల్లో శిక్షణ పొందాలన్నారు.

భక్తి శ్రద్ధలతో శంకర జయంతి



నల్లకుంట: న్యూనల్లకుంటలోని సీతా రామాంజనేయ సరస్వతి దేవాలయంలో మంగళవారం శంకర జయంతి మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వాముల మంత్రోచ్చారణల నడుమ శంకరాచార్యులకు విశేష అభిషేకం చేశారు. అనంతరం శంకరాచార్యులమూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా శ్రీగురు సంకల్పం అసోసియేషన్ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న నగేష్ ముదిరాజ్

ముషీరాబాద్: మానసిక స్థితి సరిగ్గా లేని వారికి అందరు అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ వెల్లడించారు. రాంనగర్ విద్యానగర్‌లోని శ్రీ గురు సంకల్పం అసోసియేషన్ 20వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మతి స్థిమితం సరిగ్గా లేని పిల్లలు ఇందులో ఆశ్రమం పొందుతున్నారు. శుభకార్యాలు, పుట్టిన రోజుల్లో వీరితో కలిసి జరుపుకుంటూ వారికి అండగా ఉంటూ కొండంత భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన



అడ్డగుట్ట: రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలందించిన పారా మెడికల్ స్టాఫ్‌ను విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. తొలగించిన రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఈఎం పోర్టల్ ద్వారా జరుగుతున్న స్టాఫ్ రిక్రూట్‌మెంట్‌ను నిలిపి కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్‌ను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. అదే విధంగా రైల్వేలను ప్రైవేటీకరణ చేసే చర్యలను కూడా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో సీఐటీయూ నగర నాయకులు అజయ్ బాబు, అజయ్ బాబు, కుమారస్వామి పాల్గొన్నారు.

భావితరాల బాగుకు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి తలసాని, చిత్రంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: భావి తరాల బాగు కోసం బీఆర్ఎస్‌కు మరోసారి అండగా నిలవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గ పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా తెలంగాణ తరహా అభివృద్ధి కోసమే టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందని బీఆర్ఎస్ ఏర్పాటు మరో చరిత్ర కాబోతుందన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో వచ్చిన మార్పును ప్రజలు గమనించేలా చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేసి చూపించారన్నారు.

- అభివృద్ధిపై అంబర్‌పేట మహంకాళీ దేవాలయం లేదా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో చర్చించేందుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సిద్ధంగా ఉన్నారని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సిద్ధమా అని సవాల్ చేశారు. బీజేపీ నేతలకు దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం అవసరం లేదని కేవలం మతాలతో రాజకీయాలు చేయడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వందలాది కోట్ల రూపాయలతో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చేయలేనన్ని అభివృద్ధి పనులను గత నాలుగేళ్లలో పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తలసాని సాయికిరణ్, కార్పొరేటర్ విజయ్‌కుమార్, కాలేరు మణికంఠ, దిడ్డి రాంబాబు, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, భీష్మ పాల్గొన్నారు.

వడ్డెర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జెంపేటి సత్యనారాయణరాజు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర ప్రజలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా ఉండేలా ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తామని వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయం ట్రస్టీ చైర్మన్ జెంపేటి సత్యనారాయణరాజు స్పష్టం చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర్లను గుర్తించి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించేందుకు స్థలంతో పాటు నిధులను కేటాయించడం అభినందనీయమన్నారు. వడ్డెర్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తగిన అవకాశం, గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కాంట్రాక్టు పనుల్లో కూడా వడ్డెర్లకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంతయ్య, డాక్టర్ ఒర్సు కృష్ణయ్య, పల్లపు సమ్మయ్య, ఎం.వెంకటేష్, పి.వెంకటకృష్ణ, జి.సాయికృష్ణ, ఎం.నర్సింహ్మా, వల్లెపు వెంకటి, రాయల చందర్‌రావు పాల్గొన్నారు.

రూ. వెయ్యి కోట్ల బోగస్ చెల్లింపులపై ఏసీబీ విచారణ జరపాలి

సీపీఎం డిమాండ్


మాట్లాడుతున్న శ్రీనివాస్

ముషీరాబాద్: 2014 నుంచి 2020 వరకు ఆరేళ్ల కాలంలో 531 కోట్లు మాత్రమే ఖర్చు కాగా 2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు 14 నెలల కాలంలో వెల్ఫేర్ బోర్డు నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం రూ.1417 కోట్లు ఎలా ఖర్చు అయ్యాయని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్, మహేందర్ ప్రశ్నించారు. మంగళవారం గొల్కొండ క్రాస్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికశాఖలో రూ.వెయ్యి కోట్ల బోగస్ చెల్లింపులపై భారీ కుంభకోణం జరిగిందని దానిపై ఏసీబీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి బోర్డులో అవినీతి, అక్రమాల పరంపర కొనసాగుతుందని వాటిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఇటీవల సూర్యపేట జిల్లాలో 80 డెత్‌క్లైయిలపై అనుమానాలు రాగా వాటిలో 15 దరఖాస్తులను విచారించగా 15 దరఖాస్తులు బోగస్ డెత్ సరిఫికెట్లతో క్లైయిమ్ చేశారని అధికారులు తేల్చారు. అలాగే వరంగల్ జిల్లాలో డెత్ క్లైయిమ్ లబ్ధిదారులకు రెండుసార్లు చెల్లించిన ఘటనలో 64 లక్షలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రమాదంలో మరణించిన కార్మికులకు చెల్లింపులలో 25 కోట్లు దుర్వినియోగం జరిగిందని దీనిపై విచారణకు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆధ్వర్యంలో విచారణ జరిపినప్పటికీ ఏ అధికారిపై చర్యలు తీసుకోలేదన్నారు. హన్మకొండ జిల్లా పరకాలలో బోగస్ డెత్‌క్లైయిమ్‌లపై దందా నడిపిస్తున్న ఓ అధికారి బంధువులను పోలీసులు అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి అవకతవకలు అన్ని జిల్లాలో జరుగుతున్నాయని కార్మిక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చిన స్పందన లేదన్నారు. కార్మికులకు చెందిన వందల కోట్ల డబ్బును దళారులతో కలిసి అధికారులు పంచుకుంటున్నారని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

కవాడిగూడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరుపేద విద్యార్థులకు విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడం జరుగుతుందని బండ మైసమ్మ నగర్ అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ ఉమా అన్నారు. మూడేళ్లుగా బండ మైసమ్మ నగర్ 1,2 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలో చేరడానికి వెళ్తున్న ఐదుగురు చిన్నారులకు మంగళవారం కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారిని సత్కరించారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పిల్లలకు విద్యను అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సెంటర్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించి విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా చిన్ననాటి నుంచే వారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, శారదా, ఆయాలు మీనాక్షి, భువనేశ్వరి, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు


కార్పొరేటర్ దూసరి లావణ్యకు కేక్ తినిపిస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మంగళవారం ఛేనెంబర్ చౌరస్తాలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించి జై తెలంగాణ నినాదాలను హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కె.పద్మావతిరెడ్డి, గరిగంటి శ్రీదేవి, పులి జగన్, నాయకులు గరిగంటి రమేష్, నాగేష్‌గౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


ఛే నెంబర్ చౌరస్తాలో..

బీజేపీవి నీచ రాజకీయాలు

● అంసోల్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడం నీచ రాజకీయాలకు నిదర్శనమని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం ఆయన బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులం, మతం చిచ్చుతో బీజేపీ గెలవాలనుకోవడం సిగ్గుచేటని కులాల మధ్య చిచ్చుపెట్టి తెలంగాణలో అధికారంలోకి వస్తామనుకోవడం వారికి కలగానే మిగిలిపోతుందన్నారు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన చేయాలని దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నా పట్టించుకోని బీజేపీ, తెలంగాణలో ముస్లింలు, దళితులు, బీసీల మధ్య అల్లర్లకు పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

కాచిగూడ: సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న హాస్టళ్లలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ పొంగిన హుస్సేన్‌సాగర్ డ్రెయిన్‌లైన్

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ జనతాపార్కు, హెచ్ఎస్ఆర్ ఆరుట్ల అపార్ట్‌మెంట్ వద్ద భూగర్భ హుస్సేన్‌సాగర్ డ్రెయిన్‌లైన్ మళ్లీ పొంగింది. గత నాలుగు నెలలుగా ఉన్న సమస్యకు పరిష్కారం కోసం ఇటీవల గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ పర్యటించి జీహెచ్ఎంసీ డీఈ సన్ని, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌లను పిలిపించి పనులు పూర్తి చేయించారు. మరమ్మతులు నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసిన కొన్ని రోజులకే మళ్లీ సమస్య పునరావృతం అయింది. మంగళవారం కార్పొరేటర్ అక్కడకు చేరుకుని అధికారులను రప్పించి సిబ్బందితో దగ్గరుండి మరమ్మతు పనులు పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, పి.నర్సింగ్‌రావు, ఎం.ఉమేష్, మహమూద్, సాయికుమార్, ఆనంద్‌రావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని మాణికేశ్వర్‌నగర్ మైనార్టీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ ఏర్పాటు చేద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. పలువురు మాట్లాడుతూ.. ఓయూ నిర్మాణ సమయంలో వడ్డెర్ల అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని యూనివర్సిటీ అధికారులు స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాన్ని హాస్పిటల్‌కు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షం చేస్తున్న దీక్షకు ఆందోళనకు సంఘీభావంగా ఎండి ఉస్మాన్, ఇక్బాల్, నవాబ్, గౌస్, ఇస్మాయిల్, అబ్బు, ఉస్మాన్ అలీ, ఖాజా పాషా,రహీం, నజ్జు, మహబూబ్ అలీ, మహమూద్, రియాజ్ దీక్షలో పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ క్రీడా మైదానాల్లో ఈ నెల 30 నుంచి కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు నిర్వహిస్తున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ తెలిపారు. మంగళవారం మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో బోర్డు అధికారులతో కలిసి ఆయన మైదానంలోని మౌలిక వసతులు, క్రీడా సామగ్రి ఏర్పాటు, మైదానాల అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో క్రీడలు అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఖేలో ఇండియా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సకాలంలో క్రీడల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలు


మాట్లాడుతున్న చొక్కాపు వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలని మోటివేషనల్ స్పీకర్, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ.. గౌరవ ప్రదమైన, బాధ్యతయుతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. విద్యార్థుల జీవితాన్ని సక్రమంగా మలిచేది గురువులే అని అధ్యాపకులు అంటే నిరంతరం అధ్యయనం చేయడమేనని తెలిపారు. బాలసాహితివేత్త చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నేడు పిల్లలు తమ పసితనంలోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుంటున్నారని ఉపాధ్యాయులు కూడా ఆ దిశగా పయణించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రీయమైన ఆలోచన విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులకు నేర్పాలని కోరారు. తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్షులు భూపతివెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, డాక్టర్ సి.ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: ప్రజా సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందని కార్పొరేటర్ రవిచారి వెల్లడించారు. గత కొన్ని రోజులుగా బాగ్‌లింగంపల్లి సూర్యనగర్, శ్రీరాంనగర్ కమాన్, శ్రీరామ్‌నగర్ కమాన్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందించకపోవడంతో కార్పొరేటర్ రవిచారికి సమస్యను వివరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం జలమండలి ఆజామాబాద్ సెక్షన్ మేనేజర్ జ్యోతితో కలిసి పర్యటించారు. సాధ్యమైనంత త్వరగా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ వేసి చాలా సంవత్సరాలు గడుస్తుండడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని తొలగించి కొత్త లైన్ వేయాలన్నారు.

'తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం'

అంబర్‌పేట: రోజురోజుకు బీజేపీ పార్టీకి ఆదరణ పెరుగుతుందని అది ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ చౌకబారు విమర్శలు చేస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు అన్నారు. అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని గౌతమ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటు పడుతున్నారన్నారు. ప్రతి పోలింగ్‌బూత్ స్థాయిలో ఈ నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, రమేష్, అజయ్‌కుమార్, నాగభూషణం చారి, యశ్వంత్, ఆనంద్‌గౌడ్, భిక్షపతి, కృష్ణ, బ్రహ్మచారి పాల్గొన్నారు.


వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

డీవైఎఫ్ఐ జాతీయ సమావేశాలు జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ఆనగంటి వెంకటేశ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చేనెల 26, 27,28 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే డీవైఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం చిక్కడపల్లిలోని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఈ జాతీయ సమావేశంలో యువజన సంఘం నాయకులు పాల్గొంటారని దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీని విస్మరించిందని ఇలాంటి సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణిత గడువులోపు వేసిన నోటిఫికేషన్లన్నింటికి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బషీర్, తిరుపతి, శివవర్మ, మహేష్, సహాయ కార్యదర్శి జావేద్, నూరి, ఉమెన్‌వింగ్ కన్వీనర్ రోషిణిఖాన్ పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య మార్గం అనుసరణీయం


ఆదిశంకరాచార్యకు నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీదేవి, అతిథులు

చిక్కడపల్లి: ఆదిశంకరాచార్య వేద బాష్యాలు పరమ ప్రామాణికమని అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. త్యాగారాయగాన సభలో మంగళవారం జరిగిన ఆది శంకరులు జయంతి ఉత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారతీయ సనాతనధర్మ సారథి శంకరాచార్య అని సమాజంలో ఆకృత్యాలు, దురచారాలు విలయతాండవం చేస్తున్న సందర్భంలో శంకరుని అవతార పురుషునిగా ఆదిశంకరాచార్య ఆవిర్భావం జరిగిందన్నారు. ఆయన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాలినడకన పర్యటించి శంకరస్తకం, కనక దారా స్తోత్రం వంటి పలు దేవతల ప్రార్థనా శ్లోకాలను తన పన్నెండేళ్ల వయస్సులోనే అందించిన ఆది గురువు అన్నారు. గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ఆదిశంకరాచార్య దేశం నాలుగు ప్రాంతాలలో నాలుగు పీఠాలు సనాతన ధర్మ పరిరక్షణకు స్థాపించారని ఆ పీఠంలో ఒకటైన శృంగేరి పీఠ అధిపతి నియంత్రణలో ఉన్న జ్ఞాన సరస్వతి దేవాలయానికి తాను ధర్మధికారి కావటం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ.. సర్వజీవుల్లోనూ ఆత్మ ఒక్కటి అని భేదాలు లేవన్న ఆది శంకరుని మార్గం అనుసరణీయం అన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పద్మవెంకట్‌రెడ్డి

నల్లకుంట: మలేరియా దోమ కాటుతో వస్తుందని, ఇది ప్లాస్మోడియం అనే పరాన్నజీవుల వల్ల కలిగే ఒక రోగం అని మలేరియా విభాగం అధికారి నిరంజన్ అన్నారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి మలేరియా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణ నుంచి ఫీవర్ చౌరస్తా మీదుగా రత్నానగర్ వరకు ర్యాలీ నిర్వహించి వ్యాధిపై అవగాహన కల్పించారు. మలేరియా నివారణే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తామని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. దోమలు కుట్టడం ద్వారా మలేరియా మనుషులకు వ్యాపిస్తుందని దోమల వల్ల వచ్చే మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శకుంతల, రాధ, మాలశ్రీ, ఎస్ఎస్.మూర్తి, వేణుకుమార్ పాల్గొన్నారు.

భరత్‌నగర్, ఎరుకలబస్తీ, వడ్డెరబస్తీల్లో..

అంబర్‌పేట: దోమల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో డివిజన్‌లో చేపట్టిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. భరత్‌నగర్, ఎరుకలబస్తీ, వడ్డెరబస్తీ ప్రాంతాల్లో దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలు, ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో చెత్త లేకుండా చూసుకుంటే దోమల బెడద ఉండదన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది